




498 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడూరు: మండలంలోని చిన్న లాలపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా శుక్రవారం ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో 498 మందికి వైద్యాధికారి డాక్టర్ మారుతీ రావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. రోగులకు అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వచ్చి ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ మారుతీ రావు ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో చిన్న పిల్లల నిపుణులు డాక్టర్ ప్రసాద్, కంటి వైద్య నిపుణులు కిరణ్ కుమార్, ఎముకలు కీళ్ల డాక్టరు శ్రీనివాసులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

..ప్రజల జీవన విధానాలు దెబ్బతిన్నాయి.
..సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు రమాదేవి



జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు రమాదేవి

ప్రజాశక్తి-పొదలకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలని, వీటిని ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వీరికి కర్రుగాల్చి బుద్ధి చెబుతారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. మండలం లోని విరువూరు గ్రామంలో శుక్రవారం మూడో పాదయాత్ర ప్రారంభమైంది. ఈ పాదయాత్రలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఈ ప్రభుత్వాలలో నిత్యావసర సరుకుల ధరలు, గ్యాస్, ఇంధన ధరలు పెరిగాయని పేర్కొన్నారు. ప్రస్తుతం సామాన్యుడు బతికే పరిస్థితి లేదన్నారు. విద్యుత్, ఆర్‌టిసి ధరలు పెరిగాయన్నారు. సంపూర్ణ మద్య నిషేధం చేస్తానన్న ముఖ్యమంత్రి, ప్రస్తుతం అధిక ధరలతో నాసిరక మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారన్నారు. ఏపి రాష్ట్ర ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ రాష్ట్రాన్ని దోచుకుంటుందని విమర్శించారు. 2018లో అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలో "ఇచ్చిన మాట తప్పం. మడమ తిప్పం" అని పేర్కొన్నారన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించక పోగా.. ప్రధాని మోదీతో జతకట్టి దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును సిపిఎం సంపూర్ణంగా ఖండిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. రోడ్ల మరమ్మతుల నిర్మాణం చేపట్టే లేదని దుయ్యబట్టారు. నాలుగు న్నర సంవత్సరంగా ప్రారంభం చేయని జగనన్న ఇళ్ల నిర్మాణం ఇప్పుడు ఎలక్షన్ వస్తుందని కాబట్టి ప్రారంభం చేశారని విమర్శించారు. జిల్లాలోని ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ ఏపీ జెన్కో విద్యుత్ కేంద్రం ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టు లకు అనుసంధానంగా ఏర్పడిన పరిశ్రమలలో స్థానికులకు 75శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించా లన్నారు. దేగపూడి - గొట్టపాలెం వరకు ప్రాంతాల ప్రజలకు సాగునీరు అందించే బండేపల్లి బ్రాంచ్ కెనాల్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రభగిరిపట్నం షుగర్ ఫ్యాక్టరీని పునః ప్రారంభించాలని, రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కాగితాలపూరు, కొమ్మలపూడి, కదిరి పల్లి గ్రామాల భూ సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. మనుబోలు మండల పరిపాలనా కార్యాలయాలకు అనుసంధానంగా జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలన్నారు. క్రిబ్ కో పరిశ్రమకు సర్వేపల్లి వద్ద సేకరించిన భూము లలో వెంటనే ఫ్యాక్టరీ నిర్మించి, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. వెంకటా చలం, ముత్తుకూరు మండలాల్లో పంట పొలాలను ముంపునకు గురి చేస్తున్న నక్కల కాలువ మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. శాశ్వత ప్రాతిపదికన సైడ్ వాల్స్ నిర్మాణం లేదా రివిట్ మెంట్ వేయాలన్నారు. రాష్ట్రంతో పాటు జిల్లాలో పలుచోట్ల పాదయాత్రలు జరుగుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజా సమస్యలను ఎజెండాగా చేర్చడమే ప్రధాన లక్ష్యంగా ఈ యాత్రను చేపట్టినట్లు తెలిపారు. నెల్లూరు జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేయడం తమ ధ్యేయం మని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. మోహన్ రావు, గోగుల శ్రీనివాసులు, తుళ్లూరు గోపాల్, సిపిఎం సీనియర్ నాయకులు చండ్ర రాజగోపాల్, జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్, బత్తల కృష్ణయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్, సిపిఎం మండల కార్యదర్శి బి. మనోహర్, మండల ఇన్‌ఛార్జ్ కె. పెంచల నరసయ్య, సిఐటియు నాయకులు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శివకుమారి, ఎస్.కె షాహీనా బేగం, కె. రమణమ్మ, కిన్నెర కుమార్, కొండ ప్రసాద్, విరువూరు కార్యదర్శి యానాదిరెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు



నగదు బహుమతిని అందజేస్తున్న దృశ్యం

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి-లింగసముద్రం: స్థానిక కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రిటైర్డ్ డిఆర్‌డిఒ డైరెక్టర్ జడ శ్రీనివాసులు జ్ఞాపకార్థం ఆయన సతీమణి జడ రజనీకుమారి నగదు బహుమతి అందజే శారు. శుక్రవారం పాఠశాలలో ప్రధానో పాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పదవ తరగతిలో 558 సాధించి మొదటి స్థానంలో నిలిచిన మక్కెన సాయి యశ్వంత్‌కు ఐదువేల రూపాయలు,546 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన కందుల సుదీక్షకు ఐదువేల రూపా యలను అందజేశారు. అనంతరం రజనీకు మారిని ప్రధానోపాధ్యయులు ఉమ్మడిశెట్టి మాధవరావు, ఉపాధ్యాయులు,సిబ్బంది శాలువ కప్పి ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 శివకుమార్, మాజీ ఎంపిపి పూరిమిట్ల బాలకోటయ్య, మాజీ సర్పంచ్ ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ కొట్టె చెన్నయ్య, ఉపాధ్యాయులు కిలారి వెంకటేశ్వర్లు, కొండయ్య, ఎ.నారయణ, కె.ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాలు అందజేత

ప్రజాశక్తి-కందుకూరు: ఆకలికి అందరూ బంధువులే అనే నినాదంతో ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ కందుకూరు వారి ఆధ్వర్యంలో శుక్రవారం దాతల సహాయంతో పేదవారికోసం కందుకూరులో నిస్సహాయులైన వారిని గుర్తించి వారికి భోజ నాల ప్యాకెట్లు అందించడం జరిగింది.ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా పేదవారికి సహాయం అందిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఫౌ ఁడేషన్ సెక్రటరీ షంషేర్ అన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ సాజిద్, ట్రజరర్ హఫీజ్, ఇన్‌ఛార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్, షంషుద్దీన్ పాల్గొన్నారు.



అధికారులారా తప్పుచేసి చిక్కుల్లో పడొద్దు..!

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

జిల్లాలోని అధికారులు తప్పుచేసి చిక్కుల్లో పడవద్దని, ఆర్నెల్లలో టీడీపీ అధికారంలోకి వస్తోందని, తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదలిపెట్టమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వేపల్లిలో కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆదేశాలతో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులందరూ ఫలితం అనుభవిస్తూ వస్తున్నారు కోడూరులో రొయ్యల గుంతలను ధ్వంసం చేసిన అటవీ అధికారులకు హైకోర్టు ఏ శిక్ష వేసిందో చూస్తున్నామన్నారు. ఏపీ అసైన్మెంట్‌ల్యాండ్ పీఓటీ యాక్టును దుర్వినియోగం చేసేలా సర్వేపల్లిలో భారీ కుట్ర జరుగుతుందన్నారు. రామదాసుకండ్రిగలో ఎకరా రూ.కోటి విలువైన భూములను రూ.15 లక్షలకే కొనుగోలు చేసి ఈ చట్టం ద్వారా పట్టాలు పొందే ప్రయత్నంలో ఉన్నారని తెలిపారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో అనేక భూకుంభకోణాలు జరిగాయని, మంత్రులు, ఎంఎల్ఎలు, వైసీపీ నేతల ఆదేశాలతో అధికారులు చాలా తప్పులు చేశారన్నారు. తప్పులు చేసిన అధికారులందరూ శిక్షలు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆదేశాలతో రొయ్యల గుంతలు ధ్వంసం చేసిన అటవీశాఖ సబ్ డీఎఫ్ఓ మంగమ్మ, రేంజర్ మారుతీ ప్రసాద్ రూ. లక్ష చొప్పున చెల్లించాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. ఆ పరిహారాన్ని అధికారుల నుంచి ప్రభుత్వం వసూలు చేసి బాధిత రైతుకు 15 రోజుల లోపు చెల్లించకపోతే ఇద్దరు అధికారులను 15 రోజులు సివిల్ జైలులో ఉంచాలని తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా కూడా విధించింది. ఆ జరిమానా చెల్లించకపోతే మరో 15 రోజులు సివిల్ జైలులో ఉండాలని తీర్పు వెలువరించిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వారం పదిరోజులకే తోటపల్లి గూడూరు మండలం, కోడూరులో గంగాధర్ సాగుచేస్తున్న రొయ్యల గుంతలను ఈ అధికారులు అటవీ భూముల పేరుతో ధ్వంసం చేశారన్నారు. కోర్టు స్టే ఉన్నప్పటికీ ఖాతరు చేయకుండా 16 ఎకరాల గుంతల్లోని సుమారు రూ.కోటి విలువైన రొయ్యలతో పాటు సామగ్రిని సముద్రంపాల్జేశారు. ఇది వైసిపి నేతలు కుట్రలో బాగమన్నారు. దానికి అధికారులు ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నారన్నారు.మత్స్యకార గ్రామాలకు చెందిన ఈ భూములను లీజుకు తీసుకుని సాగుచేసుకుంటున్న బీసీ నాయకులపై కక్షసాధింపులకు పాల్పడ్డారు కాకాణి మాటలు విని రైతును నష్టపరిచిన మంగమ్మ, మారుతీ ప్రసాద్ ప్రమోషన్ల అంశంలోనూ ఈ కేసు ప్రభావం చూపనుందన్నారు. ఆ ఇద్దరు అధికారుల కెరీర్ పై పడిన బ్లాక్ మార్కును ఎవరూ చెరపలేరని, చేసిన తప్పుకు వారు శిక్ష అనుభవించాల్సిందేనన్నారు. ఇప్పుడు మరో ఆరుగురు తహశీల్దార్లపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి విచారణ చేసి నివేదిక పంపాలని జిల్లా అధికారులను సీసీఎల్‌ఏ ఆదేశించి ఉంది...వారిలోనూ కాకాణి గోవర్ధన్ రెడ్డి బాధితులు ఉన్నారు.



పత్రాలు చూపుతున్న టిడిపి నేత సోమిరెడ్డి

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిఎంఒ

పజాశక్తి-నెల్లూరు: స్థానిక ఆకుతోట ప్రాంతంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా మలేరియా అధికారిణి ఈ హుసేనమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఆకుతోట పట్టణ ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ ఆరోగ్య కేంద్రంలో మలేరియా, డెంగీ పరీక్షలు ఎన్ని చేశారు.. ఏ తరహాలో నిర్వహిస్తున్నారో ల్యాబ్ టెక్నిషియన్‌ను అడిగి తెలుసుకున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో సిబ్బంది విధిగా పర్యటిస్తూ ఫ్రైడే డ్రై డే గురించి ప్రజలకు తెలియజేసి చైతన్య పరచాలని కోరారు. దోమలు అభివద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎఎన్‌ఎం లు, ఆశా కార్యకర్తలు ఫీల్డ్ నందు జ్వరాలను గుర్తించిన వెంటనే సంబంధిత వైద్యాధికారి కి తెలియచేసి వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విజయవంతంగా జగనన్న ఆరోగ్య సురక్ష..!

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: మండలంలోని సౌత్ ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయ వంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ కన్నం హేమలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబంలో ఎటువంటి ఖర్చులు లేకుండా ఉచితంగా చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. మండల ఉపాధ్యక్షులు చెరుకూరు శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాష, పాఠశాల ఉపాధ్యాయురాలు కె. విద్యులత, ఎంఏఓ జయరామ నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సరళ కుమారి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలం టీర్లర్లు పాల్గొన్నారు.



రాళ్లపాడు ఎడమ కాలువ పనులను ప్రారంభించండి

ప్రజాశక్తి-లింగసముద్రం: జిల్లా సమగ్రాభివృద్ధిని కోరుతూ, కందుకూరు నియోజకవర్గంలోని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో అక్టోబర్ 2న ప్రారంభమైన పాదయాత్ర 6వతేదీన మండ లంలోకి ప్రవేశించింది. వలేటివారి పాలెం నుంచి ప్రారంభమైన ప్రాదయాత్ర మండలంలోకి ప్రవేశించిన తరువాత వెంగాళపురం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.అక్కడ నుంచి జంగంరెడ్డిపాలెం, రామకృష్ణాపురం, బలిజపాలెం, గోపాల్‌నగర్ మీదుగా లింగసముద్రం, వాకమళ్లవారిపాలెం, తాతహోటల్ మీదుగా రాళ్లపాడు ప్రాజెక్టు వరకు చేరుకుంది. అక్కడ నుంచి కొత్తపేట, రేణమాల మీదుగా కొండాపురంకు చేరుకుంది. లింగసముద్రంలో జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పనుల వెంటనే ప్రారంభించాలని, ఆయుకట్టు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎడమ కాలువ పొడగింపు పనులను పూర్తి చేస్తే వేల ఎకరాల భూములు సాగులోకి వస్తాయన్నారు. అంతేకాకుండా వలేటివారిపాలెం, జెడ్.ఉప్పలపాడు, పోకూరు, శాఖవరం చెరువులకు నీళ్లు నింపాలని కోరారు. అర్ధాతంగా నిలిచిపోయిన సోమశిల ఉత్తర కాలువ వెడల్పు పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. రామాయపట్నం పోర్టులో 75 శాతం ఉద్యోగాలను స్థానికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్ర కార్యక్రమంలో కత్తి శ్రీనివాసులు, ఎస్‌కె మస్తాన్‌బీ, రెహనాబేగం, కత్తి పద్మ, షంషాద్, జి.శేషయ్య, శ్రీరా ములు, దయాకర్, మాల్యాద్రి, కందుకూరు నియోజకవర్గం నాయకులు జి.వెంకటేశ్వర్లు, ఎస్.ఎ.గౌస్, జివిబి కుమార్, కొట్టే వెంకయ్య, ఐద్వా నాయకురాలు కొండమ్మ, విజయలక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి చప్పిడి కొండలరావు, డి.జాన్, అంగన్‌వాడనాయకులు మార్తమ్మ, రమాదేవి, ప్రభావతి, విజయకుమారి, ప్రమీల, ఫర్విన్, సరోజ, తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రను చేస్తున్న నాయకులు

కొనసాగుతున్న నిరసన దీక్షలు

ప్రజాశక్తి-కందుకూరు :నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా, కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 24వ రోజుకు కొనసాగాయి. కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన దీక్షలలో, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతిపక్షాలపై కక్ష సాధింపు ధోరణి వ్యవహరిస్తుందని అన్నారు.కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నాదెళ్ల వెంకట సుబ్బారావు, నాయకులు గోచిపాతల మోషే, చిలకపాటి మధుబాబు కూనం నరేంద్ర, వడ్డెళ్ల రవిచంద్ర, ఉమ్మనేని సుబ్బారావు, బత్తిన మాల్యాద్రి, పువ్వాడి వేణు, రాయపాటి శ్రీనివాసరావు, రావుల రవి, తిరుపతి వెంకయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.



నిరసన దీక్ష చేస్తున్న నాయకులు

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-కందుకూరు: కోర్టులో దాఖలు చేసే ప్రతి పిటిషన్‌కి రూ.20 వెల్ఫేర్ స్టాంపు అంటించాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ కందుకూరు న్యాయవాదులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.కోర్టు ఎదుట నిరసన చేపట్టిన లాయర్లు మాట్లాడుతూ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఏకపక్షంగా తీసుకున్న వెల్ఫేర్ స్టాంపుల విషయాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని కోరారు. ఈ విషయంపై రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. న్యాయవాదుల వెల్ఫేర్ కు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కందుకూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎం మల్లికార్జునరావు, న్యాయవాదులు సన్నెబోయిన శ్రీనివాసులు ,బెజవాడ కష్ణయ్య చౌదరి, టి గోపాలకష్ణమూర్తి, బి వెంకటేశ్వర్లు, ఎం మహేష్, బి సాయి శంకర్ ,టి తిరుమలరావు, షేక్ సంసుద్దీన్, బివి మురళీకష్ణ వివి సుబ్బారావు, పెన్నా కష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న లాయర్లు

తామర పురుగుతో రాలుతున్న పూత, పిందే

ప్రజాశక్తి-కందుకూరు: అసాధారణ ఉష్ణోగ్రతలు పునాస మామిడి తోటలకు తామర పురుగును తెచ్చిపెడుతున్నాయి. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రత 37 డిగ్రీల సెల్సియస్ నమోదు అవుతుంది. సాధారణంగా అక్టోబర్లో ఇంతటి ఉష్ణోగ్రత ఎప్పుడూ నమోదు కాదు. ఉష్ణోగ్రత పెచ్చుపెరగడంతో పునాస మామిడి తోటలపై తామర పురుగు విజృంభిస్తోంది. ఉష్ణోగ్రతకు తామర పురుగుకు లంకె ఉంది. పగటి ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్ దాటితే తామర పురుగు చెలరేగుతుంది. సాధారణ ఉష్ణోగ్రతలలో 18 రోజుల కాల పరిమితితో గుడ్లు పెట్టే తామర పురుగు ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్ దాటితే 11 రోజులకే గుడ్లు పెడుతుంది. తామర పురుగు నివారణకు పూర్తిస్థాయి లో క్రిమిసంహారక మందులు లేవు, క్రిమిసంహారక మందులకు 25 శాతం తామర పురుగులు మాత్రమే దొరుకుతాయి. జులై నుంచి జనవరి లోపు కాపుకి వచ్చే పునాస మామిడిలను పచ్చళ్లకు వినియోగిస్తారు. ఈ సబ్ డివిజన్ నుంచి పునాస మామిళ్లను కేరళ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఈ గోకుడు వల్ల మామిడి కాయల పై రాతి మంగు ఏర్పడుతుంది. రాత్రి మంగు ఏర్పడిన పునాస మామిడికాయలకు మార్కెట్లో తక్కువ ధర మాత్రమే పలుకుతాయి.



కాకాణి మాటలు నమ్మొద్దు

ప్రజాశక్తి-పొదలకూరు: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జైలు నుంచి కడిగిన ముత్యంలా బయటికి వస్తారని మాజీ మంత్రి, టీడీపీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తాటిపర్తి గ్రామంలో బాబు తో నేను కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన "సత్యమేవ జయతే " రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ మాజీ సిఎం చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఏర్పాటు చేసి 2.15 లక్షల మందికి శిక్షణ ఇచ్చారన్నారు. అందులో 80 వేల మందికి ఉద్యోగాలు కూడా వచ్చాయన్నారు. జగన్ నాలుగున్నర ఏళ్ల పరిపాలనలో రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు. మంత్రి కాకాణి అక్రమాలకు, అవినీతి సంపాదనకు అడ్డే లేకుండా పోయిందన్నారు. మట్టి, గ్రావెల్తో పాటు ప్రభగిరి పట్నం కొండను పూర్తిగా లేపేశారన్నారు. ప్రజాస్వామ్యం దేశంలో గాంధీ మార్గంలో నెల్లూరు లో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తే, పాల్గొన్న 16 మంది నాయకులపై కేసు పెట్టడం దారుణం అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, రైతు సంఘం నాయకులు రాధాకష్ణమనాయుడు, దావా.పెంచలరావు, తలచీరు. మస్తాన్ బాబు, బొద్దులూరి మల్లికార్జున్ నాయుడు,పెంచల భాస్కర్ రెడ్డి, బాలిరెడ్డి. హనుమారెడ్డి, పల్లారపు కష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోమిరెడ్డి

వెంకట్ కిరణ్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: ఆసియా వేదిక్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం హోసూరు లోని హోటల్ క్లరిస్టాలో సామాజిక సేవలలో కషి చేసిన వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులకు గౌరవ డాక్టరేట్ అందజేశారు. ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లా వెంకకటగిరికి చెందిన కె.సాయి వెంకట కిరణ్ కుమార్ ప్రయివేట్ స్కూల్లో ప్రిన్సిపల్ గా పని చేస్తున్నారు. ఈసందర్భంగా పలువురు ఉపాధ్యాయులు కె.సాయి వెంకట కిరణ్ కుమార్ సేవల్ని అభినందించారు.



నీటి పైపులకు మరమ్మతులు

ప్రజాశక్తి-గుడూరు: స్థానిక బస్టాండ్ సెంటర్లో పగిలిపోయిన రాళ్లపాడు మంచినీటి పథకం పైపులను స్థానిక సిబ్బంది శుక్రవారం మరమ్మతులు చేశారు. వారం రోజుల క్రితం పైపులు పగిలిపోవడంతో నీరు వథాఅవుతూ సరఫరా ఆగిపోవడంతో ఎట్టకేలకు మరమ్మతులు పూర్తి చేశారు.

రౌడీమూకలను శిక్షించాలి

ప్రజాశక్తి-కందుకూరు :చంద్రబాబునాయుడు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ నంద్యాల జిల్లా , శ్రీశైలం నియోజకవర్గం పరిధిలోని చిన్నదేవళాపురం గ్రామం నుండి రాజమండ్రి సెంట్రల్ జైలు వరకు చంద్రబాబు నాయుడుకు మద్దతుగా పాదయాత్ర చేస్తున్న టిడిపి వీరాభిమాని చింతల నారాయణపై ఉమ్మడి గుంటూరు జిల్లా వినుకొండ నియోజకవర్గంలో వైసిపి నాయకులు (నలుగురు వ్యక్తులు) దాడిచేసి గాయ పరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు గోచి పాతల మోషే తెలిపారు. నారాయణకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. అధైర్యపడవద్దని ధైర్యంగా ఉండాలని మోషే సూచించారు. నారాయణపై దాడిచేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రౌడీమూకలను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో భవిష్యత్తులో జరిగే పరిణామలకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.



హామీలను సంపూర్ణంగా అమలు చేశాం

ప్రజాశక్తి-వెంకటాచలం: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని సంపూర్ణంగా అమలు చేసి, ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.కురిచెర్లపాడు గ్రామంలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేసిన మంత్రి, సచివాలయ భవన నిర్మాణం, మినరల్ వాటర్ ప్లాంట్స్, సీసీ రోడ్లు, డ్రైన్లు, జల జీవన్ మిషన్ మొదలైన రూ. 3.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు.

నరుకూరులో బాబుతో నేను..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని నరుకూరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ శుక్రవారం "బాబుతో నేను" కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబుకు మద్దతు తెలియచేయాలనీ కోరుతూ "బాబు తో నేను" కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు ఆరికాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కమిటీ కార్యదర్శి కొణతం రఘుబాబు, టీపీగూడూరు మండల పార్టీ ఉపాధ్యక్షులు పాకం వెంకయ్య, బిఎల్‌పి ఆసాది నరేష్, కొణతం శ్రీనివాసులు, సాదేపల్లి చెన్నయ్య, ముష్టిగుంట సుబ్రహ్మణ్యం, నాసిన రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఓరల్ ఎంక్వయిరీ మేళా


ప్రజాశక్తి-నెల్లూరు

పోలీసు శాఖలో పెండింగ్‌లోని శాఖ పరమైన ఓరల్ ఎంక్వయిరీకి సంబంధించిన ఫైల్స్‌ను పూర్తి చేయాలని సిబ్బందికి ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అధికారులు, సిబ్బందిలతో (సివిల్, ఎ.ఆర్, హోంగార్డ్స్) కవాతు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పోలీసు సంక్షేమ దివాన్‌ను నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీసు సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో తరచుగా డిజర్టర్ అయితే సహించేది లేదన్నారు. అదే సమయంలో విధులకు అనవసరంగా గైర్హాజరు కావద్దని సూచించారు. అనంతరం పెరేడ్ గ్రౌండ్‌లో సిబ్బంది సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా "పోలీస్ సంక్షేమ దివాస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి డిజర్షన్, బదిలీలు, ఈఎల్‌ఎఫ్‌పి, భద్రత లోన్, అనారోగ్యం తదితర సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతిపత్రాలను నేరుగా ఆయన స్వీకరించి , నిశితంగా పరిశీలించి, అడ్మినిస్ట్రేటివ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్.పి.(అడ్మిన్),(క్రైమ్స్), (ఏఆర్) విభాగాల అధికారులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

9 నుంచి విద్యుత్తు ఛార్జీల తగ్గింపు కోసం పోరాటం

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు సంస్కరణల పేరుతో పెంచిన విద్యుత్తు ఛార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు పోరాటాలు నిర్వహిస్తున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు ప్రకటించారు. శనివారం స్థానిక సంతపేట ప్రాంతంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సిపిఎం నాయకులు నగేష్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి తన అధికార దాహంతో విద్యుత్తు ఛార్జీలు అమాంతం పెంచి ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతున్నా రన్నారు. ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు వామపక్ష పార్టీలు పోరాటాలు నిర్వహిస్తుంటాయన్నారు.కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి అరిగేలా సాయి, సయ్యద్ సిరాజ్, సిపిఐ ఎంఎల్ నాయకులు యాదయ్య, లక్ష్మీ రెడ్డి, నంది పోగు రమణయ్య ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కందుకూరు: నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు, నియోజకవర్గ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో కందుకూరు పట్టణం 32వ వార్డు విజయ్ నగర్ కాలనీలో బాబుతో నేను కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు అందజేశారు. మల్లేశ్వరరావు మాట్లాడారు..కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు ముప్పవరపు వేణు, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీ, నాయకులు చిలకపాటి మధుబాబు, వడ్డెళ్ళ రవిచంద్ర, బెజవాడ ప్రసాద్, కూనం నరేంద్ర, గోచిపాతల మోషే, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మాల్యాద్రికి ఘననివాళి

ప్రజాశక్తి-కందుకూరు: హదయ సంబంధమైన వ్యాధితో మరణించిన హాస్టల్ పూర్వ విద్యార్థి కసుకుర్తి మాల్యాద్రికి హాస్టల్ పూర్వ విద్యార్థుల సంఘం తరపున ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హాస్టల్ పూర్వి విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి కల్లగుంట మోహన్ రావు మాట్లాడుతూ పరిసర ప్రాంతాల నుంచి వచ్చి కందుకూరు హాస్టల్లో చదువుకున్నటువంటి ఎంతో మంది విద్యార్థులకు మాల్యాద్రి తల్లిదండ్రి గురువు లాగా వారికి అనేక విషయాలలో అండగా ఉండేవాడని సామాజిక విషయాలు తెలియజేస్తూ సామాజిక ఉద్యమ కార్యకర్తలుగా నాయకులుగా ఎంతో మందిని తయారు చేశాడని చెప్పారు.కార్యక్రమంలో బండి గోవిందయ్య, షేక్ అబ్దుల్లా, గుమ్మ శ్రీనివాసులు థామస్, బిక్షాలు రమేషు ఇమ్మానియేలు ఆనంద్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి


అసంపూర్తిగా నిలిచిన రాజులపాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-మర్రిపాడు

వలసలను నివారించి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కటారి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి సాధన కోసం సిపిఎం చేపట్టిన పాదయాత్ర శుక్రవారం మర్రిపాడు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న జిల్లాగా నెల్లూరు అని చెప్పేవారన్నారు. దాదాపు 16 మండలాలు తిరుపతి జిల్లాకు వెళ్లిన తర్వాత 38 మండలాలతో మెట్టప్రాంతం జిల్లాగా మిగిలిందన్నారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలలో 35 మండలాలు మెట్ట ప్రాంతాలుగా ఉన్నాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా ఎంతో మంది రాజకీయంగా ఉన్నతమైన పదవులు పొంది రాష్ట్ర ప్రభుత్వంలో స్థాయి కలిగిన వ్యక్తులు ఉన్నా అభివృద్ధి ఎక్కడా కనిపించలేదన్నారు. బద్వేల్ తర్వాత నెల్లూరు వరకు నిరుద్యోగుల ఉపాధి కోసం ఏవైనా ఫ్యాక్టరీలో ఉన్నాయా అని ప్రశ్నించారు. ఆత్మకూరులోని నారంపేట వద్ద ఫ్యాక్టరీ మంజూరై పనులు చేపట్టిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి బద్వేల్ ప్రాంతానికి తీసుకెళ్లారన్నారు. ఆ ఫ్యాక్టరీ ఉంటే నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించేవి కానీ దురదృష్టవశాత్తు అది వెళ్లిపోయిందన్నారు. మెట్ట ప్రాంతాల అభివృద్ధి కోసం సోమశిల ప్రాజెక్టును నిర్మించి 30 ఏళ్లు అయినా మర్రిపాడు మండలానికి నీళ్లురాలేదని, అనంతసాగరం మండలానికి దిక్కు లేదన్నారు. సోమశిల హైలెవెల్ కెనాల్ పనులను పాదయాత్ర బృందం చూడగా శిలాఫలకం మాత్రమే ఉండి సమాధి రాయిగా మిగిలిపోయిందన్నారు. హైలెవెల్ కెనాల్ పనులు ప్రారంభించి 10ఏళ్లు దాటినా తట్టెడు మట్టి కూడా వేయలేదని, రాష్ట్ర బడ్జెట్లో ఎందుకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు. మెట్ట ప్రాంతాలలో ఉపాధి పనులు తప్ప వేరే పనులు లేవని, 100 రోజుల ఉపాధి హామీ కూలి పని ఉన్నా 30 రోజులు కూడా పని కల్పించడం లేదని, ఇచ్చే డబ్బులు కూడా సక్రమంగా రావడం లేదన్నారు. మోతుబరి రైతు అయిన పనులు లేనప్పుడు ఉపాధి పనులకు వెలితేనే నాలుగు వేళ్లు లోనికి వెళ్లేదని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలన్నారు. గ్రామాలలో ఉండే యువతి యువకులకు పనులు లేక బయట రాష్ట్రాలకు వెళ్లి పనులు చేసుకుంటూ బతుకుతున్నారని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు మళ్లీ ఓట్లకు రాబోతున్నారని తమ ప్రాంతం గ్రామాభివృద్ధి కోసం ఏమి చేశారని నిలదీసి అడగాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులకు స్థానిక రైతులు భూములను ఇస్తే ప్రధాని వ్యాపారవేత్త అదానికి అప్పగించారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలను కనికరించాలని కోరారు. అనంతరం ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య పాదయాత్ర బృందంతో కలిసి నిధులు లేక పనులు నిలిచిపోయిన రాజులపాడు రిజర్వాయర్‌ను పరిశీలించారు. గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి రూ.800కోట్ల నిధులను విడుదల చేయగా కొన్ని పనులు చేపట్టారు. గతంలో టిడిపి ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం కోసం బడ్జెట్లో రూపాయి కూడా కేటాయించలేదన్నారు. మేఘా కంపెనీ పైపులు వేసి సగం పనులు చేశారన్నారు. ప్రాజెక్టు మొదటి భాగం చాపురాలపల్లి, ఎగువపల్లి కేతామన్నేరు వాగుపై రిజర్వాయర్ కట్టి 13 కిలోమీటర్లు పొంగూరు భీమవరం దగ్గర రిజర్వాయర్లు నిర్మించి అక్కడి నుండి రాజులపాడు రిజర్వాయర్‌కు నీళ్లు అందించడం ద్వారా మండలంలోని భూములు సస్యశ్యామలంగా ఉంటాయని పేర్కొన్నారు. మొదటి ఫేజ్‌లో పనులు నిలుపు వేసి ఫేజ్-2లో పనులు చేపట్టడం దుర్మార్గమన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 90 వేల ఎకరాలకు సాగునీరు రెండు లక్షల మందికి తాగునీరు అందిస్తుందన్నారు. అక్టోబర్ 13న నెల్లూరులో జరిగే భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో పాల్గొనే జయప్రదం చేయాలనివారు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, గంట లక్ష్మీపతి, సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి రహమతుల్లా, సిఐటియు మండల కార్యదర్శి రత్నయ్య, ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు శ్యామలమ్మ, మూలి ప్రమీల, మండల వ్యవసాయ సంఘం నాయకులు, సుధాకర్, మహమ్మద్ గౌస్, రామయ్య, సీనియర్ నాయకులు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


దీక్ష చేపడుతున్న టిడిపి, సిపిఐ నాయకులు

కొనసాగుతున్న టిడిపి రిలే దీక్షలు

ప్రజాశక్తి-కావలి

మాజీ సిఎం చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా, కావలి నియోజకవర్గ టిడిపి కార్యాలయం వద్ద పార్టీ కుటుంబ సభ్యులతోశుక్రవారం రిలే నిరాహార దీక్షలు ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి మాట్లాడుతూ ఈరోజుటికీ చంద్రబాబు నాయుడును 28 రోజులుగా జైలులో ఉంచారని, కనీసం ఆయనకు జైలులో మంచి వసతులు కూడా కల్పించకుండా కక్ష సాధింపుతోనే ఈ ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇటువంటి కక్ష సాధింపు సిఎంను రాష్ట్ర ప్రజలు ఇప్పటివరకు చూడలేదని, ఇకపై చూడబోరని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. పేద ప్రజలను అంధకారంలోకి నెట్టిన ఏకైక ప్రభుత్వం ఈ వైసిపి ప్రభుత్వమని ధ్వజమెత్తారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు. రాబోయే 2024 ఎన్నికల్లో టిడిపిని అఖండ మెజారిటీతో గెలిపించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జ్యోతి బాబురావు, బొట్లగుంట శ్రీహరి నాయుడు, గొట్టిపాటి రాము, మక్కి శ్రీహరి, ఆవుల రామకృష్ణ, పోతుగంటి శ్రీకాంత్, పల్లపుకుమార్, దావులూరు దేవకుమార్, మస్తాన్, రఫీ, సిపిఐ నాయకులు దర్గాబాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు బోర్డులో ప్రత్యామ్నాయ పంటలపై శుక్రవారం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ధరలు వివిధ దేశాలలో పొగాకు సాగు, దిగుబడి, నాణ్యత, అనేక అంతర్జాతీయ అంశాలపై ఆధారపడి ఉంటాయని, పొగాకు ధరలు స్థిరమైన ఆదాయ వనరులుగా పరిగణించరాదన్నారు. పొగాకు పంటను వర్జీనియా పొగాకు బోర్డు అనుమతించిన విస్తీర్ణం 2.9 హెక్టార్లు ఒక బ్యారెన్‌కి, అనుమతించిన పంట 3650 కేజీలకు ఒక బ్యారెన్‌కు మాత్రమే పండించాలని సూచించారు. పొగాకు పంట పెరగటం వల్ల ధరలు తగ్గే అవకాశం ఉందని, పొగాకు పంటను తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించి ఖర్చులు తగ్గించుకోవాలని కోరారు. ప్రతి రైతు భూసారాన్ని పెంచుతూ పచ్చరొట్ట ఎరువులు తప్పనిసరిగా పెంచుకోవాలన్నారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలైన కంది, మినుము, శనగ, వంటి పప్పు ధాన్యాలను పండించడం ద్వారా మంచి లాభాలు పొందవచ్చన్నారు. అంతర్జాతీయంగా పొగాకు పంటకు ఆంక్షలు విధిస్తూ పొగాకు పంటను తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలైన చిరు ధాన్యాలు జొన్న, సజ్జ, రాగి, పామాయిల్, వేరుశనగ వంటి ధాన్యాలు వేసుకోవచ్చన్నారు. పామాయిల్‌పైన ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తుందని తెలియజేశారు. వ్యవసాయ అధికారి రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధికై పలు రకాల పథకాలు ఇస్తుందని, వాటిని రైతులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులను ఆర్.బి.కె. ద్వారా సరఫరా చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎస్ పాదలకూరు శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు, కె.వి.కె. నెల్లూరు శాస్త్రవేత్త శివజ్యోతి, మండల వ్యవసాయ అధికారి రామ్మోహన్, వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్, పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని కదిరినాయుడుపల్లి కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తూ ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. కంభం విజయరెడ్డి, మాగంటి సుబ్బయ్య, స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందిన మహిమలూరు సూర్య ప్రకాష్, సి.ఆర్.పి.గా పనిచేస్తూ ఎస్‌ఏఆర్‌టీగా మండల విద్యాశాఖ పరిధిలో వెళ్లిన ఇరుపోతు భాగ్యమ్మలను పడమటి నాయుడుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో కదిరినాయుడుపల్లి కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 ధనలక్ష్మి మాట్లాడుతూ నలుగురు ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఎంతో నిబద్ధతతో, అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలను పొందారని తెలిపారు. విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, వారి సేవలను ఘనంగా కొనియాడారు. అనంతరం కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు వారిని శాలువాపూలమాల, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ముస్తఫ్ఫ్ రెడ్డి, విశ్రాంత ఎంఇఒ జొన్నా సత్యనారాయణ, ఎం.ఆర్.జి రాజేంద్ర కుమార్, కాంప్లెక్స్ సెక్రటరీ విజయభాస్కర్ రెడ్డి, సి.ఎంఒటీ కస్తూరయ్య, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదానం



ప్రజాశక్తి-కావలి : మూడు సంవత్సరాల క్రితం ప్రమాదవశాత్తు మరణించిన తమ మిత్రుడు పుల్ల నాగరాజు పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం అతని మిత్రబృందం 51మంది రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పుల్ల నాగరాజు తండ్రి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ కుమారుడు చిన్నవయస్సులోనే మంచి సామాజిక స్పృహ కలిగి ఉండేవాడని, రక్తదానంపై ఆసక్తి కలిగి ఉండేవాడని, అతని ఆత్మశాంతి రక్తదానం ద్వారానే కలుగుతుందని భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పి.బాలాజీ, బి.శేఖర్, జి.సాయి గౌతమ్, బి.శశి, పుల్లా.రావి, కె.సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

'కాకర్ల' సేవలపై ప్రజలు హర్షం



ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు కాకర్ల ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ అందిస్తున్న ఎన్‌టిఆర్ సంజీవని రథం ఉచిత సేవలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం దుత్తలూరు మండలం కమ్మవారిపాలెం సెంటర్ ఆరుగు వద్ద 136వ రోజు ఎన్‌టిఆర్ సంజీవని ఆరోగ్య రథంలో అనారోగ్య సమస్యలు ఉన్న గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 160 మందిని డాక్టర్లు వివిధ ఆరోగ్య సమస్యలను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు వైద్య శిబిరాన్ని సందర్శించి సంజీవని ఆరోగ్య రథంలో అందిస్తున్న వైద్య సేవలను గ్రామస్తుల నుండి ఆయన అడిగి తెలుసుకున్నారు. ముందుగా కాకర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కమ్మవారిపాలెం గ్రామస్తులతో చంద్రబాబు అక్రమ అరెస్టుపై నిరసన ర్యాలీ చేపట్టారు.

పశువైద్యశాలలో జెడి తనిఖీలు

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రభుత్వ పశువైద్యశాలను జిల్లా వెటర్నరీ జెడి వి.కోటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని కుర్రపల్లిలో ఉన్న ప్రభుత్వ పశువైద్యశాలను ఆయన తనిఖీ చేసి అనంతరం వైద్యశాలలోని పలు రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మూగజీవాల సంరక్షణకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ కార్యక్రమాలను పశుపోషకులకు ఉపయోగపడేలా అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ పంచాయతీ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఎడి శేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం



ప్రజాశక్తి - ఉదయగిరి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సానా శ్రీనివాసరెడ్డికి శుక్రవారం ఏపి ఎంఆర్పిఎస్ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు సర్వేపల్లి ప్రసాద్ మాట్లాడుతూ మండల ప్రజలు భూ సమస్యలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటువంటి తరుణంలో తహశీల్దార్‌గా ఉదయగిరికి రావడం సంతోషంగా ఉందన్నారు. మండల కన్వీనర్ సిఎం ఓబుల్ రెడ్డితో తహశీల్దార్‌ను శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించి స్వీట్లు పంచిపెట్టారు. మండల అధ్యక్షులు నాగేశ్ మహేష్, సెక్రటరీ గడల బాబు, కిషోర్, జోసెఫ్, జి.వెంకటేష్, ఆర్.రోశయ్య, జి.శేఖర్, ఆర్.పవన్, యోహాన్, వెంగయ్య ఉన్నారు.

కలెక్టర్ రాకతో ఎట్టకేలకు పారిశుధ్య పనులు



ప్రజాశక్తి-ఉదయగిరి : మేజర్ పంచాయతీ ఉదయగిరిలో కార్మికుల వేతనాలు చెల్లించలేదని విధులు బహిష్కరణలో ఉన్న కార్మికులు కలెక్టర్ రాకతో శుక్రవారం ఎట్టకేలకు పారిశుధ్య పనులు చేపట్టారు. పట్టణంలో అపరిశుభ్రతతో రోడ్లు నిండిపోవడంతో కలెక్టర్ రాకతో పారిశుధ్య పనులు చేపట్టడంతో పట్టణ ప్రజలు విషజ్వరాల నుండి విముక్తి పొందారు. పలువురు పట్టణ పెద్దలు ప్రజా సంఘాలు కార్మికుల వేతనాలు ఎప్పటికప్పుడు చెల్లిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఉదయగిరి మీదుగా సీతారాంపురం మండలంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వెళ్తున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శిలో పారిశుద్ధ్య కార్మికులను పిలిపించుకొని పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపట్టడం బాధాకరమన్నారు. ఇకనైనా ఇలాంటి తప్పిదాలు జరగకుండా కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించాలని కోరారు. పట్టణంలోని పలు వీధుల్లోని డ్రైనేజీల్లో పేరుకొని ఉన్న చెత్తను తొలగించి మురుగు కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లడం ప్రారంభించారు.

'ఉపాధి'ని దూరం చేస్తున్న పాలకులు

ప్రజాశక్తి-కందుకూరు : ఉపాధి హామీ పథకాన్ని పేదలకు దూరం చేసే విధంగా పాలకులు వ్యవహరిస్తున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కత్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధి సాధన కోసం సిపిఎం ఆధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్ర 5వ రోజుకు భాగంగా జలదంకిపాలెం నుంచి ప్రారంభమైంది. వలేటివారిపాలెంలో పాత చెరువు కాల్వ పూడిక పనులను పాదయాత్ర బృందం పరిశీలించి, పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. ఈ బృందంలో సిపిఎం జిల్లా నాయకులు జి.శేషయ్య, వేణు, కత్తి పద్మ శంషాద్, దువ్వూరి జాన్, తదితరులు పాల్గొన్నారు.

మురళికి సన్మానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని కరటంపాడు కాంప్లెక్స్ పరిధిలో సిఆర్‌పిగా పది సంవత్సరాలు సేవలందించి ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు సిఆర్‌పి నుండి సిఎంఆర్‌టిగా రిలీవ్ అయి ఎంఇఒ ఆఫీసులో జాయిన్ అయిన మురళికి శుక్రవారం కరటంపాడు కాంప్లెక్స్ పరిధిలోని పలువురు ప్రధాన ఉపాధ్యాయులు ఉపాధ్యాయులతో కలిసి ఎంఇఒలు షేక్ నజీర్ భాషా, చలపతి ఘనంగా సన్మానించారు. ఎస్ఎంసి చైర్మన్ మాలకొండయ్య, పెంచలరెడ్డి అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు సిఎంఆర్‌టిలు పాల్గొన్నారు.



ప్రజా దీవెనలతో 'గడపగడపకు' పూర్తి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ప్రజా దీవెనలతో తాను గడపగడపకు మన ప్రభుత్వం ప్రచార కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు కోవూరు ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మొత్తలు గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం పూర్తయిన సందర్భంగా విజయోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైసిపి నేతలు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ప్రసన్న కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన అధికార అనధికార పార్టీ శ్రేణులకు పాదాభివందనం చేశారు. 2022 ఆగస్టు 1 శ్రీ జొన్నవాడ కామాక్షమ్మ ఆశీర్వాదాలతో ప్రారంభించిన గడపగడపకు మన ప్రభుత్వ ప్రచార కార్యక్రమం మైపాడు శివాలయంలో పరమశివుని కృపతో పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 86 సచివాలయాల ద్వారా లక్ష 12 గడపలను సందర్శించినట్లు ఆయన తెలిపారు. సచివాలయాలకు కేటాయించిన రూ.20 లక్షల వంతున రూ.17 కోట్ల 20 లక్షల మేర అభివృద్ధి పనులు జరిపినట్లు వివరించారు. భారతదేశంలో అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానానికి తీసుకెళ్లిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని, ఆయన శాశ్వత ముఖ్యమంత్రిగా కొనసాగాలన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు మావులూరు శ్రీనివాసుల రెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, యువనేత దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, జెడ్‌పి వైస్ చైర్మన్ విజయలక్ష్మి, గునుపాటి సురేష్ రెడ్డి, దువ్వూరు మధుసూదన్ రెడ్డి, కైలాసం శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్ -14, 17లో బాలబాలికలకు బాల్ బ్యాడ్మింటన్ నెట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు ఎంపికలు శనివారం ఆత్మకూరు పట్టణంలో నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్ విజయ, ఆత్మకూరు క్రీడల ఆర్గనైజింగ్ కార్యదర్శి తిరుపతయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ పోటీలు ఎంపికలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-సీతారామపురం

జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న మారుమూల గ్రామాలలోని ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ హరి నారాయణ పేర్కొన్నారు. సీతారామపురం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ హరినారాయణ, జెసి కూర్మానాథ్ జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అందిన అర్జీలను సంబంధిత అధికారులకు ఇచ్చి నిర్ణీత గడువులోగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇళ్ల స్థలాలు భూములు కావాలని అధికంగా అర్జీలు వచ్చాయని, అదేవిధంగా ప్రతి డిపార్ట్మెంట్‌పై సమస్యలు ఉన్నాయన్నారు. మొత్తం 290 పైగా ప్రజా అర్జీలు వచ్చాయన్నారు. వీటన్నింటికీ త్వరలో పరిష్కారం అందుతాయన్నారు. మే 9వ తేదీ నుండి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రజలలో సమస్యల పరిష్కారానికి ప్రజల మధ్యలో ఉండి వారి


అర్జీని స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

సమస్యలను ముఖ్యమంత్రి కార్యాలయ పర్యవేక్షణలో పరీక్షించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. సీతారామపురం మండలంలో రెండు హైవే నిర్మాణాలు వెళ్తుండడంతో రైతులు నష్టపరిహారం సరిపోవడం లేదని అర్జీలు ఇచ్చారని వారు ఆర్బిట్రేషన్ పిటిషన్ ఇస్తే చట్ట ప్రకారం కలెక్టర్ కార్యాలయం నుండి నష్టం పరిహారం సరిపోని రైతులకు న్యాయం జరిగేలా ప్రయత్నాలు చేస్తామన్నారు. డ్రెయిన్లు, రోడ్లు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించామన్నారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో మండల కేంద్రాల్లో ముందుగానే షెడ్యూల్ ప్రకటించి ప్రతి బుధ, శుక్రవారాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రానికి రాలేని గ్రామాల ప్రజలు సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే సంతృప్తికర స్థాయిలో పరిష్కరించేందుకు మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీతారామపురం మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రతి మండలంలో షెడ్యూల్ ప్రకారం జగనన్న కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కరుణకుమారి, జెడ్‌పి సిఇఒ చిరంజీవి, డిపిఒ సుస్మితా రెడ్డి, డ్వామా పిడి వెంకటరావు, డిఆర్‌డిఎ పిడి సాంబశివారెడ్డి, సర్వే ఎడి హనుమన్ ప్రసాద్, డిఎంహెచ్ఒ పెంచలయ్య, హౌసింగ్ పిడి నాగరాజు, అగ్రికల్చర్ జెడి సుధాకర్ రాజు, సిపిఒ ఎస్ రాజు, ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ శేషయ్య, డిటిసి చందర్, ఇరిగేషన్, ఆర్అండ్‌బి, ఎలక్ట్రికల్ ఎస్ఇలు, పలువురు జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి

జగనన్న మనబడి నాడు-నేడు పనులను ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు పరిశీలన చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బిసి కాలనీ తెలుగు పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న జగనన్న మనబడి నాడు-నేడు పనులను పరిశీలిస్తూ నాణ్యమైన వస్తువులను వాడుతూ నాణ్యతగా త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. ప్రతి కాంక్రీట్ పనికి ఉదయం, సాయంత్రం పూట వాటర్‌తో క్యూరింగ్ చేయాలని పలు సూచనలు చేశారు. హ్యాండ్ వాష్ పాయింట్స్‌కు నాణ్యమైన స్టీల్ ట్యాప్‌లను వాడాలని పూర్తయిన ప్రతి పనిని ఎస్‌టిఎమ్ఎస్ యాప్‌లో నమోదు చేసి పూర్తి దశలో ఉన్న మీ పాఠశాలకు అవసరమగు నిధులు వచ్చే విధంగా కృషి చేస్తానని



ప్రధానోపాధ్యాయులకు ఉపాధ్యాయులకు తెలిపారు. అనంతరం 5వ తరగతి విద్యార్థుల అభ్యసన పఠన సామర్థ్య నైపుణ్యాలను పరిశీలిస్తూ విద్యార్థుల వారి తరగతి స్థాయికి తగ్గట్టుగా ఉన్నవని ముఖ్యంగా గుణకారంలో జనరల్ నాలెడ్జ్‌లో విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మరికొన్ని సూచనలు చేశారు.


సురక్ష కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపిపి వేణుగోపాల్‌రెడ్డి

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్రంలో ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నాడని ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కరటంపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, జెడ్‌పిటిసి పి.ప్రసన్నలక్ష్మి పాల్గొని మాట్లాడారు. సిఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతిఒక్కరికీ గ్రామ స్థాయిలోనే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వారికి అవసరమయ్యే మందులు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని రూపొందించారని తెలియజేశారు. జెసిఎస్ కోఆర్డినేటర్ వల్లభనేని రాజేంద్ర మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సిఎం జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల ఆరోగ్య దృష్ట్యా వారికి మంచి వైద్యం అందించాలని ఉద్దేశంతో ఈ జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఇది ప్రజలందరూ ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవతి, ఎంపిడిఒ పి.ఐజాక్ ప్రవీణ్, ఎఒ కె.శ్రీనివాసరావు, డాక్టర్లు అనూష, దేవానంద్, స్పెషలిస్ట్ డాక్టర్లు ఇఒ (పిఆర్ అండ్‌ఆర్‌డి), సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఫిర్యాదుపై అధికారుల విచారణ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం హరిజన వాడ వాసుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఇరిగేషన్ డిఇ విజయభాస్కర్, సర్వేయర్ హరినాథ్ రెడ్డి, విఆర్ఒ మురళి పులక కాలువపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులతో ఫిర్యాదుదారులు మాట్లాడుతూ తాము ఫణిందర్ రెడ్డికి సంబంధించిన కాలువ విషయమై ఫిర్యాదు ఇవ్వలేదని, తమపై వేరే వ్యక్తులు జరిగిన దాడి విషయమై అర్జీలో సంతకాలు పెట్టామని మధ్య వర్తులు కొందరు దారి మళ్లించి అర్జీని తప్పుదోవ పట్టించారని అధికారుల సమక్షంలో హరిజనవాడ వాసులు వాపోయారు. అనంతరం అధికారులు విలేకరులతో మాట్లాడుతూ సదరు స్థల యజమాని ఫణిందర్ రెడ్డి స్థలంలో ఏటువంటి కాలువ లేదని అధికారులు స్పష్టం చేశారు. స్థల యజమాని భర్త ఫణిందర్ రెడ్డి మాట్లాడుతూ తనపై కొందరు నాయకులు పనిగట్టుకుని కక్షసాధిస్తున్నారని వాపోయారు.

నేటి నుంచి సంఘీభావ సదస్సులు

ప్రజాశక్తి-నెల్లూరు : నేటి నుంచి 8 రోజుల పాటు రూరల్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ, చంద్రబాబు నాయుడికి మద్దతుగా సంఘీభావ సదస్సులు నిర్వహించాలని రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. నేటి నుంచి 15వ తేదీ వరకూ ప్రతీ రోజూ వివిధ ప్రాంతాల్లో ప్రజల్లోకి వెళ్లి సంఘీభావ సదస్సులు నిర్వహించేలా ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు.

కార్గో అభివృద్ధికి సమిష్టి కృషి చేయాలి

ప్రజాశక్తి-కావలి

కార్గో విభాగం ఆదాయం పెంచేందుకు ఆర్‌టిసి అధికారులు, సిబ్బంది సమిష్టి కృషిచేయాలని ఎపిఎస్ ఆర్‌టిసి బోర్డు డైరెక్టర్ ఏ.రాజారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అయన ఆధ్వర్యంలో కార్గో అభివృద్ధి కమిటీ కావలి డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 51,488 మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్పు చేసినందున వారి జీతాలు సకాలంలో ప్రభుత్వ ఖజానా నుండి చెల్లిస్తున్నట్లు తెలిపారు. బస్సులు నడపడడం ద్వారా వచ్చిన ఆదాయంతో రూ.2500 కోట్లు ఆర్‌టిసి అప్పులు తీర్చబడ్డాయన్నారు. కార్గో విభాగం తదితర వాణిజ్య ఆదాయం ద్వారా వచ్చే మొత్తం కార్మికుల సంక్షేమానికి వినియోగిస్తున్నామన్నారు. సరుకు రవాణా ద్వారా ఈ ఆర్థిక సంవత్సర అంతానికి రూ.250 కోట్లు వస్తుందని, 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తం రూ.1000 కోట్లకు పెంచేందుకు కార్గో అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి అన్నీ జిల్లాలు పర్యటించి అక్కడ వినియోగదారులు, సిబ్బంది సలహాలు తీసుకుంటున్నామన్నారు. కావలి డిపో కార్గో విభాగం పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. కావలి వస్త్ర వ్యాపారుల కోరిక మేరకు త్వరలోనే టుపే చెల్లింపులు పునప్రారంభిస్తామన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులందరూ వైఎస్ జగన్‌కు కృతజ్ఞత కలిగి ఉండాలన్నారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆర్‌టిసి (ప్రజా రవాణా)కు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ రూ.9678 కోట్లు కేటాయించి, సామాన్య ప్రయాణికుడు కూడా విలాసవంతమైన, సురక్షితమైన ప్రయాణం అనుభవించాలనే ఉద్దేశంతో డిజిల్ బస్సుల స్థానంలో దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ఎన్నడూ లేనివిధంగా ఆర్‌టిసి సిబ్బందికి మెరుగైన పెన్షన్


మాట్లాడుతున్న రాజారెడ్డి

అందించనున్నారన్నారు. చనిపోయిన ఉద్యోగుల భార్య, పిల్లలకు ఆర్‌టిసి సంస్థలో ఖాళీ లేనందున ప్రభుత్వ విభాగాల్లో సచివాలయంలో కారుణ్య నియామకాలు చేపట్టి, దేశంలోనే మొదటి స్థానంలో నిలిచారని డైరెక్టర్ రాజారెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని చంద్రబాబు నాయుడు ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టోలో పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న ప్రతి రవాణా వ్యవస్థ ఉచిత ప్రయాణ హామీలతో ఆర్‌టిసి ప్రగతి చక్రం తిరిగి తిరోగమనంలోకి వెళ్లే అవకాశం ఉందని వివరించారు. ప్రభుత్వ మన్ననలు, ప్రయాణికుల ఆదరాభిమానాలు పొందే విధంగా సంస్థ ఉద్యోగులు కృషి చేయాలని ఆర్‌టిసి బోర్డు డైరెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్గో అభివృద్ధి కమిటీ సభ్యులు గుంటూరు జిల్లా ఎటిఎం (కమర్షియల్) సురేష్ కుమార్, ఎఎం (పర్సనల్) రాజశేఖర్, కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కెవిఆర్ బాబు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్, వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు పి.ఆర్.ఖాన్, పి.జనార్దన్‌రావు తదితరులున్నారు.



యాత్రికుడికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-నెల్లూరు

యువత ఆత్మహత్యలకు పాల్పడొద్దని, యువత దేశానికి వెన్ను వలె ఉండాలని ప్రపంచ వ్యాప్తంగా ద్విచక్ర వాహనంపై 458 రోజులు పాటు ఒక లక్ష 40,000 కిలోమీటర్లను పూర్తి చేసుకొని శుక్రవారం సింహపురి పట్టణ విచ్చేసిన యాత్రికుడికి శ్రీ గణేష్ సేవ మిత్ర మండలి సభ్యులు వారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. చైర్మన్ గాలి శ్రీధర్ మాట్లాడుతూ తూపిలి కార్తీక్ సాహసయాత్ర విజయవంతమైన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలుపుతూ వారు చేసిన యాత్ర యువత అంతా మార్గదర్శంగా తీసుకొని ఆత్మహత్యలకు పాల్పడకుండా వారు చూపిన మార్గాలను కూడా ఎంచుకోవాలని తెలియజేశారు. అలాగే కార్తీక్ గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డులో పేరు సాధించాలని వారు ఆకాంక్షిస్తూ మిత్ర మండలి ఆధ్వర్యంలో విశిష్ట సేవా పురస్కారాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీధర్, చిరంజీవి, సురేష్, అవినాష్, అభినయ్, సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-కావలి



ముసునూరు ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో సంయుక్త సేవాసంస్థ ద్వారా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం బాల్యవివాహాల నిర్మూలన, విద్య ప్రాముఖ్యత, తల్లిదండ్రుల పాత్ర, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై టెలివిజన్ ద్వారా విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అతిచిన్న వయస్సులోనే ఆడపిల్లలకు బలవంతపు వివాహాలు జరిపించి నందు వల్ల ఎన్నో సమస్యలకు లోనై ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆడపిల్లలకు 18సంవత్సరాలు వయస్సు పూర్తి అయినంత వరకూ పెళ్లిళ్లు చేయరాదన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న అనేక రాయితీలు, పథకాలు, సద్వినియోగం చేసుకొని, తల్లి దండ్రులు బిడ్డలను బాగా చదివించి మంచి ఉన్నత స్థితికి ఎదగడానికి ప్రయత్నించాలని సలహాలిచ్చారు. అలా కాకుండ బాల్యంలోనే తల్లి దండ్రులు పెళ్లిళ్ల జరిపించిన అలాంటి వారిపై కఠినచర్యలు పోలీసు వారు తీసుకొనే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థినులు తల్లిదండ్రులకు అన్నివిధాల నచ్చచెప్పి ఇష్టపడి, కష్టపడి బాగా చదువుకొని మంచి ఉన్నత స్థితికి యదగాలని సలహా ఇచ్చారు. సంయుక్త సేవాసంస్థ అధ్యక్షులు సురేంద్ర చేస్తున్న టెలివిజన్ ద్వారా ప్రదర్శిస్తున్న ఇటువంటి, వినూత్న అవగాహన కార్యక్రమం వల్ల కొంతైనా బాలికల్లో, తల్లిదండ్రుల్లో మార్పు వస్తుందని వక్తలు ఆశాభావం వ్యక్త చేశారు. పాఠశాల యాజమాన్యం సెలవుల్లో విద్యార్థులకు చదువులతో పాటు బాలికల స్థితిగతులపై అవగాహన బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.సుజాత, సంయుక్త సేవా సంస్థ అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు, ఖాదర్బాష, ఎం.వి.న్.ప్రసాద రావు, ప్రధానోపాధ్యాయులు నేలటూరి శివప్రసాద్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.